'ఈనాడు డైలీ (ఆదివారం) 19.9.2004

# రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది

రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది... అదిరిపడ్డాడు ఆదిమూర్తి.

రాధమ్మ పెళ్ళి ఆగిపోవడం ఏమిటి?

మొన్నమొన్ననే కదా నిశ్చితార్థం ఘనంగా, ఇంచుమించు పెళ్ళిలా జరిగింది.

అంతలోనే అశనిపాతంలా ఈ వార్త!

పెళ్ళి ముహూర్తం ఇక పది రోజులు కూడా లేదు.

ఒకవిధంగా చెప్పాలంటే రాధమ్మ పెళ్ళికి మధ్యవర్తిత్వం వహించింది ఆదిమూర్తే. అంతమాత్రాన ఆమె పెళ్ళి ఆగిపోయిన విషయం ఇంతవరకూ అతనికి తెలియక పోవడమనేది అదొక విశేషంగా పరిగణించరాదు. ఏమంటే తను గత పదిహేను రోజులుగా ఊళ్ళో లేడు. ఆఫీసు పనిపై ముంబాయి వెళ్ళాడు.

ఆదిమూర్తి కేంప్ నుంచి రాగానే అతని భార్య మిగతా విషయాలకన్నా ముందుగా రాధమ్మ పెళ్ళి ఆగిపోయిన వార్త చేరవేయగానే నీరసంతో కుర్చీలో కూలబడిపోయేడు.

పెళ్ళి ఆగిపోయిన కారణాలు అడిగితే ఆమె తనకు తెలియవద్దన్నది అమాయకంగా. అయితే రాధమ్మ పెళ్ళి ఆగిపోయినందుకు ఆమె లోలోన ఆనందిస్తున్నదనే విషయం ఆదిమూర్తి గ్రహించకపోలేదు. ఆమె కసికి కారణం ఉంది.

నాలుగేళ్ళ క్రితం తమ ఒక్కగానొక్క కొడుక్కి రాధమ్మనిచ్చి పెళ్ళి చేయమని ఆదిమూర్తి దంపతులు రాధమ్మ తండ్రి మోహనరావు ఇంటికి వెళ్ళి అడిగేరు. ఒక్క రూపాయి కూడా కట్నం అక్కరలేదు. రాధమ్మ నివ్వండి చాలు అన్నారు.

ఆదిమూర్తి కొడుకు అందగాడు. బాగా చదువుకున్నవాడు. సద్గుణ సంపన్నుడు. గవర్నమెంటు కంపెనీలో పెద్ద ఉద్యోగస్థుడు. అయినప్పటికీ -

"మా అమ్మాయి అప్పుడే పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడడం లేదు. క్షమించండి" అని బాధగా మోహనరావు చెప్పలేక చెప్పేడు.

రాధమ్మ అప్పుడు ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది.

"ఇప్పుడు నా ధ్యాస అంతా చదువు మీదే. దయచేసి నన్ను పెళ్ళి ఊబిలోకి లాగవద్దు" అని రాధమ్మ స్పష్టంగా తెలియజేసింది. రాధమ్మ ర్యాంక్ స్టూడెంట్. ఆమె లక్ష్య నిర్దేశాన్ని డిస్టర్బ్ చేసే శక్తి పెళ్ళికి లేకపోయింది.

విశేషం ఏమిటంటే దీని కారణంగా ఇద్దరు మిత్రుల మధ్య స్నేహం దెబ్బతినలేదు.

పైగా రాధమ్మని అభినందించకుండా ఉండలేకపోయేడు ఆదిమూర్తి.

ఆ తర్వాత డిగ్రీతో ఆగిపోలేదు రాధమ్మ. తల్లిదండ్రుల పెళ్ళి ఒత్తిడికి లొంగిపోలేదు. ఐఐటిలో పెద్ద చదువులకు వెళ్ళింది. చదువు పూర్తికాకమునుపే క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఒక పెద్ద కంప్యూటర్ కంపెనీ నుంచి ఆఫర్ వచ్చింది.

బెంగుళూర్‌లో ఉద్యోగం. పాతిక వేల జీతం.

రాధమ్మపై పెళ్ళి ఒత్తిడి అలానే ఉంది. పని ఒత్తిడి కారణంగా వాయిదాలు వేసేది. చూస్తూండగానే రాధమ్మ వయసు ఇరవై ఏడు సంవత్సరాలు దాటేసింది.

పెళ్ళిపై ఇంటి నుంచి తీవ్ర వత్తిడి. రాధమ్మ కూడా పెళ్ళి ఆవశ్యకతను గుర్తించింది. పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాధమ్మకి వరుడు కావాలి.

ఆమెకి తగిన వరుడిని కుదర్చడం సామాన్యమైన విషయం కాదని, అదొక యజ్ఞంతో సమానమని అనుభవంతో మొహనరావుకి అర్థమయింది.

వరుడిని వెదకడంలో ఫెయిలయి మోహనరావు ఆందోళన చెందుతున్న సమయంలో ఆదిమూర్తే ఒక సంబంధాన్ని చూడడం తటస్థించింది. ఆదిమూర్తి దూరపు చుట్టం. విజయవాడ వాళ్ళది. వరుడి పేరు కార్తీక్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కుర్రవాడు కూడా బెంగుళూర్‌లోనే ఉద్యోగం చేస్తుడడంతో మోహనరావు ఆ సంబంధంపై ఉత్సాహం చూపించేడు.

కార్తీక్ పెళ్ళికి అతని తల్లిదండ్రులు కూడా తొందరపడుతున్నారు. ఉద్యోగం దొరకడం కాస్త ఆలస్యం కావడం చేత ప్రస్తుతం అతని వయసు ముప్ఫయి రెండులోకి వచ్చింది. కాని పైకి చెప్పడం ముప్ఫయ్యేళ్ళు! ఆ విధంగానే కనిపిస్తాడు కూడా. అందగాడు పైగా. ఆదిమూర్తి చొరవతో పెళ్ళిచూపులు అయ్యేయి. కార్తీక్ రాధమ్మను ఇష్టపడ్డాడు. రాధమ్మ కార్తీక్‌ను ఇష్టపడింది.

అందరికీ రాధమ్మ. కార్తీక్‌లు నచ్చేరు. ఆ రోజు కార్యక్రమం అక్కడితో ముగిసింది.

అసలు కథ తర్వాత మొదలయింది.

పెళ్ళి మాటలు మొదలయ్యాక మధ్యతరగతి మోహనరావు తట్టుకోవడం కష్టమయింది. అడగవలసిన కట్నకానుకలు, లాంఛనాలు పేరిట వస్తువుల జాబితా విషయంలో కార్తీక్ తల్లి వ్యూహచతురత, స్పష్టత మధ్యవర్తి ఆదిమూర్తిని ఆశ్చర్యపరిచేయి.

కార్తీక్ తల్లి పేరు కాంతమ్మ. ఆమె నోటికి జడిసి అంతా సూర్యకాంతమ్మ అంటారు. ఆమె భర్త తులసీరావు. పేరుకి మాత్రమే ఆమె పక్కన ఉంటారు. చక్రం నడిపేది మాత్రం అంతా సూర్యకాంతమ్మే.

తనకు కావాల్సిన కట్నకానుకలను డిమాండ్స్‌లా కనిపించకుండా, సంప్రదాయ ముసుగుతో చాకచక్యంగా ఆడపెళ్ళి వారి నుంచి రాబట్టుకోగలిగింది సూర్యకాంతమ్మ. వెంటనే ముహూర్తం ఉంటే - రాధమ్మ పెళ్ళి చక్కగా జరిగిపోయేదేమో. ఏమంటే తక్కువ సమయం కావడం చేత ఎవరికి వాళ్ళు పెళ్ళి పనుల్లో ఉక్కిరి బిక్కిరి అయి పరిగెట్టడమే ఉండేది తప్ప అదనపు

డిమాండ్‌లకు సూర్యకాంతమ్మకి అవకాశం దొరికేది కాదేమో!

పెళ్ళి అనుకున్న తర్వాత నెల రోజులకు నిశ్చితార్థం అయింది. పెళ్ళి ముహూర్తం మరో రెండు నెలలకు కుదిరింది. అంతే! మోహనరావు సూర్యకాంతమ్మకి అడ్డంగా దొరికిపోయేడు.

నిశ్చితార్థం అయ్యేక కూడా మాటమాటకి ఫోన్‌లు చేసి 'అది పెట్టాలి. ఇది పెట్టాలి' అంటూ ఇబ్బందులు పెట్టేది సూర్యకాంతమ్మ. రాధమ్మ తల్లి రమణమ్మ 'మనం మొదట అలా అనుకోలేదు కదా' అంటే చాలు కయ్యిమనేది సూర్యకాంతమ్మ. కోటి రూపాయల విలువ చేసే తన కొడుకుని అతి తక్కువ ఖరీదుకే వదుల్కొని మహా త్యాగం చేసేస్తున్నట్టు అవసరమనుకున్నప్పుడల్లా ప్రస్తావించేది. అడిగింది కాదంటే పెళ్ళి ఆగిపోయేటంత హడావుడి చేసేది.

సూర్యకాంతమ్మ అంతులేని కోరికలకు నివ్వెరపోయేవారు రాధమ్మ తల్లిదండ్రులు. వాళ్ళ గుండెలు బరువయ్యేవి. సూర్యకాంతమ్మ వాళ్ళని పిలుస్తున్నా, లేదా వాళ్ల ఇంటికి వస్తున్నట్టు కబురు పంపినా లేదా ఆమె నుంచి ఫోన్ వచ్చినా హడలి పోయేవారు.

మధ్యవర్తి ఆదిమూర్తి కూడా హడలిపోయి మిన్నకుండేవాడు. ఆ స్థితిలో రాధమ్మే తన తల్లిదండ్రులకు ధైర్యం చెప్పేది. ఎప్పటికప్పుడు ఫోన్ చేసి కాబోయే అత్తగారి డిమాండ్స్ అడిగి తెలుసుకుని 'ఫర్వాలేదు ఒప్పేసుకోండి. డబ్బు గురించి ఆందోళన చెందకండి. ఎంతైనా సరే, నేను పంపిస్తాను లేదా తీసుకువస్తాను దిగులు చెందకండి' అనేది రాధమ్మ.

రాధమ్మ, కార్తీక్‌లు బెంగుళూర్‌లో తరచుగా మీట్ అవ్వకపోయినా వాళ్లిద్దరి మధ్య ఇ-మెయిల్ ఉత్తరాలు, ఫోన్‌లు సాగేవి. అయితే అతని తల్లి చేష్టలు, డిమాండ్‌లు అతనికి ఏనాడూ చెప్పేది కాదు. బాధపడతాడని, బాగోదని చెప్పేది కాదు.

కని పెంచిన కొడుకుని ఒక్కసారిగా రాధమ్మకి మొగుడు రూపంలో సమర్పించడానికి సూర్యకాంతమ్మ చేస్తున్న డిమాండ్స్‌ని రాధమ్మ ఆమోదించేది – కట్నకానుకలు తనకు పరమ అసహ్యం కలిగించే విషయాలైనప్పటికీ, తీరుస్తూ పోతుంటే డిమాండ్స్‌కి అడ్డూ ఆపూ ఉండదు. కాని సహనానికి కూడా హద్దు ఉంటుంది కదా!

సూర్యకాంతం ఏ గొంతెమ్మ కోరిక కోరిందో, వాళ్ళ సహనానికి ఎంతటి పరీక్ష పెట్టిందో లేక కొడుక్కి పెద్ద కట్నం ఇచ్చే సంబంధం వెతుక్కుంటూ వచ్చిందో...

రాధమ్మ పెళ్ళి ఆగిపోవడానికి అంతకన్న కారణాలు ఇంకేమి ఉంటాయి?

రాధమ్మ పెళ్ళి ఆగిపోవడానికి సూర్యకాంతమ్మ కాకుండా కార్తీక్ ఎందుకు కారణం కాకూడదు – అనిపించింది ఆదిమూర్తికి.

కారణం చిన్నదే. కాని పెళ్ళి ఆగిపోవడానికి చిన్న కారణం చాలు. కార్తీక్ అందగాడే. కాని పొడుగు కాదు. అలా అని పొట్టీ కాదు.

అతనికి సరిసమానమైన ఎత్తులో రాధమ్మ ఉంది. అదీ వచ్చిన చిక్కు. రాధమ్మ పొడవుగా ఉండడం అతనికి అయిష్టంగా, ఇబ్బందిగా ఉంది.

ఇక్కడ విశేషం ఏమిటంటే కార్తీక్ తనకంటే పొట్టి అని రాధమ్మ అనడం లేదు. 'రాధమ్మ పొడవు' అని కార్తీక్ అంటున్నాడు. రాధమ్మ ఎత్తు అయిదు అడుగుల ఆరు అంగుళాలు.

వధువు వరుడి కన్నా తక్కువ ఎత్తులో ఉండాలి. ఎక్కువ ఉండడం సంప్రదాయం కాదు. తరతరాల పురుషాధిక్యత - అనుకున్నాడు ఆదిమూర్తి.

పెళ్ళిచూపుల కార్యక్రమం రోజు. ఆ సాయంత్రం ఆదిమూర్తి కార్తీక్‌తో ఏకాంతంగా మాట్లాడేటప్పుడు 'రాధమ్మ నీకు మనస్ఫూర్తిగా నచ్చిందా' అని అడిగేడు.

కార్తీక్ నచ్చిందంటూనే కాస్త నసిగేడు. ఆ నసుగుడు వద్దు. సూటిగా చెప్పమన్నాడు ఆదిమూర్తి.

"రాధ నాకు అన్నివిధాల నచ్చింది. నచ్చనిది ఒకటుంది. అది ఏమిటంటే ఆమె ఎత్తు. నాకన్నా కనీసం ఒక అరంగుళం అయినా పొట్టిగా ఉంటే బాగుండేది."

"కార్తీక్! అదొక పెద్ద అవరోధం కాదు. అది నీవు మనసులో పెట్టుకొని మధనపడవద్దు. రాధమ్మ నీకన్నా తక్కువ ఎత్తులో కనిపించేటట్టు ఉండడం చాలా సింపుల్. రాధమ్మ హైహీల్స్ వేసుకోదు. నీవు హైహీల్ షూ వేసుకుంటావు - బస్."

"అవునవును. అంతే... అంతే! నేనూ అదే అనుకుంటున్నాను" అని చిన్నగా సిగ్గుగా నవ్వేసి ఊరుకున్నాడు.

లేదు, లేదు కార్తీక్ ఊరుకోలేదు. మళ్ళీ ప్రస్తావించేడు. అందుకే ఆదిమూర్తికి కోపం, చిరాకు వచ్చేయి.

ఆ రోజు నిశ్చితార్థం. ఆ సాయంత్రం కార్తీక్ అక్క సుజాత పరుగున ఆదిమూర్తి వద్దకు వచ్చి కార్తీక్ విషయమై ఆందోళన వెలిబుచ్చింది.

"వీడేమిటి మావయ్యా నిశ్చితార్థం కూడా అయిపోయేక... మళ్ళీ అమ్మాయి పొడవు అంటూ రాగాలు తీస్తున్నాడు. వీడికేమైనా మతిపోయిందా? ఇదేమిట్రా బాబు అనుకొని తిన్నగా వెళ్ళి రాధమ్మతో మాట్లాడేను. పాపం! తనకి హైహీల్స్ అంటే ఎంతో ఇష్టమట. అయినప్పటికీ నా మాట కాదనలేదు. తను హైహీల్స్ ఇక వేసుకోననీ, అతి తక్కువ మందం ఉండే చెప్పులు వేసుకుంటానని ప్రామిస్ చేసింది. ఆ విషయం కార్తీక్‌తో చెబితే అయ్యో ఎందుకడిగావు అని సిగ్గుపడి జారుకున్నాడు పిచ్చెధవ" అంది సుజాత.

అవును. కార్తీక్ పిచ్చివెధవే అనిపించింది ఆదిమూర్తికి.

ఎత్తులోనే ఏమిటి? చదువులోనూ, చేస్తున్న ఉద్యోగంలోనూ, తెలివితేటల్లోనూ, అందంలోనూ, సంస్కారంలోనూ.. దేనిలోనైనా సరే కార్తీక్ రాధమ్మ ముందు నిలవలేడని పించింది.

ఆ సంగతి కచ్చితంగా కార్తీక్‌కి తెలుసు. అంచేతనే ఒకవైపు నిశ్చితార్థం అయిపోయి నప్పటికీ అతనిలో ఏదో కాంప్లెక్స్ ప్రవేశించి 'అయ్యబాబోయ్! నాకా పొడుక్కాళ్ళ రాధ వద్దు. దాన్ని పెళ్ళి చేసుకోలేను' అని పిచ్చికేకలు, జడుపు జ్వరం. కొడుకుని రక్షించు కోవడానికి

సూర్యకాంతమ్మ సిద్ధపడడంతో రాధమ్మ పెళ్ళి ఆగిపోయి ఉంటుంది - తన ఆలోచనలకి నవ్వుకున్నాడు ఆదిమూర్తి.

తనలో తను మధనపడి పిచ్చిగా ఆలోచించే బదులు.. రాధమ్మ పెళ్ళి ఎందుకాగి పోయిందో మోహనరావుకి ఫోన్ చేసి తెల్సుకోవచ్చు కదా.

ఫోన్ చేశాడు ఆదిమూర్తి. డెడ్ అయిందేమో ఎన్నిసార్లు ఫోన్ చేసినా రెస్పాన్సు లేదు.

అంత రాత్రప్పుడు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న మోహనరావు ఇంటికి వెళ్ళడం కష్టం. వెళ్ళినా ఇంట్లో ఉంటాడనే గ్యారంటీ లేదు.

ఇక అటువైపు ఫోన్ చేయక తప్పదు.

సూర్యకాంతమ్మ ఇంటికి ఫోన్ చేస్తుంటే ఆదిమూర్తి చేయి వణికింది. అవతల రిసీవర్ సూర్యకాంతమ్మ కాకుండా ఏ తులసీరావో, సుజాతో తీస్తే బాగుంటుందనుకున్నాడు.

ఆదిమూర్తికి ఆ రోజు బాగోలేదులా ఉంది.

రిసీవర్ తులసీరావు ఎత్తినా, అతని నుంచి ఫోన్ సూర్యకాంతమ్మ లాక్కొని ఆదిమూర్తికి అటాక్ ఇచ్చేసింది.

"బాగున్నారా.. అయ్యో! మీ నమస్కారాలు మాకెందుకండి బాబు - మీకే వెయ్యి నమస్కారాలు. చూసి చూసి గొప్ప ముదనష్టపు సంబంధం మాకు అంటగట్టినందుకు మీకు శతకోటి నమస్కారాలు. మీకు మేము ఏ అపకారం చేశామని ఇంత దగాకోర్ సంబంధం చూసేరు? ఇపుడు నలుగురిలో తలెత్తుకోలేక ఎలా నవ్వులపాలయ్యేమో తెలుసుకొని పకపకా నవ్వడానికా ఇంత రాత్రపుడు ఫోన్ చేశారు?.. మరిక మాటాడకండి. ఆ నీచపు, నికృష్టపు పొడుక్కాళ్ళ పీనుగ మాకు అక్కరలేదు. పెళ్ళి ఎందుకాగిపోయిందో కారణాలు మమ్మల్ని కాదు. ఆ పీనుగనే అడగండి.. మళ్ళీ ఈ విషయం ప్రస్తావిస్తే మన మధ్య ఉందనుకుంటున్న ఈ బంధుత్వం కూడా ఇకమీదట ఉండదు. జాగర్త" అని ఫోన్ పెట్టేసింది.

ఆదిమూర్తి తేరుకోడానికి కొంత టైము పట్టింది.

ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు.

మరునాటి ఉదయం ఆఫీసుకి ఒక గంట ముందుగా బయల్దేరి, తిన్నగా మోహనరావు ఇంటికి వెళ్ళేడు.

స్నానం చేసి పూజగదిలో ఉన్నాడు మోహనరావు. ఈలోగానే ఆదిమూర్తిని చూసి రమణమ్మ గొల్లుమన్నది. గట్టిగా ఏడ్చింది.

"ఒకప్పుడు మీరు మీ అబ్బాయిని రాధమ్మకి ఇవ్వడానికి ముందుకు వస్తే ఎంత తెలివి తక్కువగా ప్రవర్తించామో, ఈసారి మీరు తెచ్చిన సంబంధం విషయంలోనూ అంతే మూర్ఖంగా ప్రవర్తించేము. రాధమ్మ పెళ్లి ఆగిపోవడానికి కారణం సూర్యకాంతమ్మగారని అనుకోవడం తప్పు తప్పు. తప్పంతా మాదే."

"అసలు ఏమయింది? రాధమ్మ పెళ్ళి ఎందుకాగిపోయింది?"

"అంతా మా ఖర్మ! రాధమ్మను మేము చదివించడం ఒక పొరపాటు. బలవంతంగానైనా సరే దానికి పెళ్ళి చేయకుండా ఉద్యోగం చేయించడం అంతకన్నా పెద్ద పొరపాటు. ఇప్పుడది అందర్నీ వదిలేసి వెళ్ళిపోయింది"

"అంటే?"

"వెళ్లిపోవడమంటే ఏ ఛండాలుడితోనో లేచిపోవడం కాదు. దిక్కులేని చావు చచ్చి వైకుంఠానికి వెళ్ళిపోవడం కాదు. అన్నయ్యా! అది నా కడుపున చెడబుట్టింది. అది ఏనాడో పసితనంలోనే చచ్చిపోయుంటే బాగుండేది. రెండు రోజులు ఏడ్చీ ఏడ్చీ తర్వాత మర్చిపోయి మా బతుకు మేము బతికేవాళ్ళం. ఇప్పుడది ఒక్కసారిగా మా పరువు నట్టేట ముంచి, నలుగురిలో తలెత్తుకోనీయకుండా చేసి తన మానాన తను నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోయింది దేవుడోయ్" అంటూ రమణమ్మ ఆగని ఏడుపు.

రాధమ్మ వెళ్ళిపోవడం ఏమిటి? ఎక్కడికీ?

మోహనరావు రంగంలోకి వచ్చి ఏడుస్తున్న రమణమ్మపై కేకలు వేసి, "విషయాలన్నీ బయట మాట్లాడుకుందాం పద" అని ఆదిమూర్తితో రోడ్డుపై పడ్డాడు.

తిన్నగా ఆఫీసుకి వెళ్ళకుండా, పార్కులో ఇద్దరూ ఏకాంతంగా కూర్చున్నారు.

రాధమ్మ పెళ్లి ఆగిపోయిన వ్యవహారమంతా ఆదిమూర్తికి పూసగుచ్చినట్టుగా వివరంగా మొత్తం చెప్పేడు మోహనరావు.

రాధమ్మ పెళ్ళి వైభవంగా జరగడానికి ఇక ఇరవై రోజులు ఉండగా అంతలోనే రాధమ్మ జీవితం ఒక టర్నింగ్ పాయింట్ దగ్గర అకస్మాత్తుగా ఆగిపోయింది. ఏ రోడ్డున వెళ్ళాలో తెలీని అయోమయపు స్థితి.

రాధమ్మ జస్ట్ ఇరవై రోజుల్లో పెళ్లి పీటలపై కూర్చుంటుందనగా ఉన్నపాటున మరేమీ ఆలోచించకుండా అమెరికా వెళ్ళమని రాధమ్మ పనిచేస్తున్న కంపెనీ ఆదేశం!ఆ ప్రాజెక్ట్ ఇంపార్టెన్స్ అలాంటిది. దాన్ని డీల్ చేయడం రాధమ్మకి మాత్రమే సాధ్యమని ఆ కంపెనీ నమ్మకం. ఒక ఏడాది ప్రోగ్రాం.

రాధమ్మ హతాశురాలయింది. మరో సమయంలోనైతే అంత చక్కటి అవకాశానికి ఎంతగానో ఆనందించేది. దిగాలుపడిపోయి తన వెడ్డింగ్ కార్డు చూపించి తన పెళ్ళి ఆగకుండా చూడమని ప్రార్థించింది. బతిమిలాడింది తన కంపెనీ యాజమాన్యాన్ని.

"నో సెంటిమెంట్స్. పెళ్ళి వాయిదా వేసుకోవచ్చు. కాని ఈ ప్రెస్టేజియస్ ప్రాజెక్టుని వదుల్కోలేం. నీవు అమెరికా వెళ్ళక తప్పదు" అంటూ కటువుగా, కర్కశంగా, మొండిగా నిలబడిపోయింది మేనేజ్‌మెంట్.

రాధమ్మకి మరిక మాట్లాడే అవకాశం ఇవ్వలేదు.

ఆ స్థితిలో ఏమి చేయాలో తోచక తన ఉడ్‌బీ కార్తీక్ కొండంత అండలా కనపడి అతని దగ్గరకు పరుగు తీసింది.

రాధమ్మ చెప్పింది వింటూనే ఆమె ముఖంలోకి కాకుండా ఆమె పాదల వైపు చూసేడు. మామూలు చెప్పులే. హైహీల్స్ కావు. అయినా రాధమ్మ ఎత్తుగా కనిపిస్తున్నదేమిటి?

"మైడియర్ రాధా! నీ ప్రాబ్లెం నాకు అర్థమయింది. కాని నేను నిస్సహాయుడిని. నా చేతిలో ఏమీ లేదు. అంతా మా అమ్మే. అమ్మ ఒప్పుకుంటే ఒక ఏడాది కాదు. కొన్ని యుగాలైన వేచి ఉండగలను."

అది రాధమ్మ ఆశించని సమాధానం.

"మీరు మీ అమ్మతో మాట్లాడి ఒప్పించరాదా?"

"మా అమ్మను ఒప్పించగలిగే శక్తి నాకు భగవంతుడు ఇవ్వలేదు"

పెళ్ళి ఒక ఏడాది వాయిదాకి సూర్యకాంతమ్మను ఒప్పించమని తన తల్లిదండ్రులకు ఫోన్ చేసింది రాధమ్మ. ఇంట్లోవాళ్ళే ఒప్పుకోలేదు. సూర్యకాంతమ్మను ఇంకెక్కడ ఒప్పిస్తారు.

రాధమ్మ తనే స్వయంగా సూర్యకాంతమ్మకి ఫోన్ చేసింది.

ఒప్పుకోలేదు సూర్యకాంతమ్మ. ఉద్యోగం మానేసినా తనకు అభ్యంతరం లేదు. పెళ్లి మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వాయిదా వేసే ప్రసక్తి లేదన్నది. నిర్ణయించిన ముహూర్తానికే పెళ్ళి జరగవలసిందే అన్నది. ఎంత బతిమాలినా ఫలితం లేకపోయింది.

ఆ పరిస్థితుల్లో ఉద్యోగానికి రిజైన్ చేయడానికి నిర్ణయించుకుంది. దాంతో యాజమాన్యం కొద్దిగా కదిలింది. రాధమ్మను వదులుకోలేదు ఆ కంపెనీ. ఆమె విలువ కన్నతల్లిదండ్రులకీ, కాబోయే మొగుడికీ తెలీకపోయినా కంపెనీకి బాగా తెలుసు. అంచేత రాధమ్మ రాజీనామాను అంగీకరించకుండా, అనుకున్న ముహూర్తానికి రాధమ్మ పెళ్ళి చేసుకోవడానికి సమ్మతించింది. అయితే పెళ్ళి అయిన వారం రోజుల్లోనే రాధమ్మ అమెరికాకు పయనమవ్వాలని షరతు విధించింది.

ఆ ప్రపోజలు కొంతవరకూ బాగానే ఉందనిపించింది రాధమ్మకి.

రాధమ్మ మళ్ళీ అందరినీ ఒప్పుకోమని వేడుకుంది. ఆమెకు సానుకూలంగా ఏ ఒక్కరూ స్పందించలేదు. తల్లిదండ్రులు కాదన్నా రాధమ్మ బాధపడలేదు. కార్తీక్ ప్రవర్తన రాధమ్మను గాయపరిచింది.

అనుకున్న ముహూర్తానికి కార్తీక్ తనను పెళ్ళాడి, స్వయంగా ఎయిర్‌పోర్ట్ వరకూ తోడ్కొని వచ్చి అమెరికాకి విమానం ఎక్కిస్తాడని పిచ్చిగా ఆశించింది. ఈ స్పీడు యుగంలో ఒక ఏడాది ఎంతసేపు!

రాధమ్మ తీవ్రంగా ఆలోచించింది. తన ఆప్తమిత్రులతో చర్చించింది. వెన్నెముక లేని కార్తీక్ కన్నా తన కెరీర్ వైపే రాధమ్మ మొగ్గు చూపింది. ప్రియమిత్రుల బెస్ట్ విషెస్, శుభాకాంక్షల మధ్య విమాన మెక్కింది. అమెరికాలో దిగింది.

జరిగినదంతా తెలుసుకున్నాక రాధమ్మ పెళ్ళి ఆగిపోయినందుకు బాధపడలేదు ఆదిమూర్తి. రాధమ్మ లాంటి కూతురు కలిగినందుకు తండ్రిగా మోహనరావును గర్వించమన్నాడు.